

విశాఖతోనే అనుబంధం ఎక్కువ..

విజయనగరం జిల్లా ఏర్పడక ముందు శృంగవరపుకోట నియోజకవర్గం విశాఖ జిల్లాలోనే ఉండేది. అయితే 1971లో శ్రీకాకుళంలోని కొన్ని ప్రాంతాలు, విశాఖ జిల్లాలోని మరికొన్ని ప్రాంతాలను కలిపి విజయనగరం జిల్లాగా అప్పట్లో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో ఎస్.కోట విశాఖ జిల్లా నుంచి వేరైంది. అయినప్పటికీ ఆ జిల్లాతోనే ఇక్కడి ప్రజలకు అనుబంధం ఎక్కువ. ఉపాధి, ఉద్యోగాలు అక్కడే చేస్తున్నారు. ఎస్.కోట నియోజకవర్గ పరిధిలోని కొత్తవలస పట్టణం విశాఖకు 5 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. విశాఖ నుంచి అరకుకు వెళ్లే ప్రధాన రహదారి కూడా ఎస్.కోట పరిధిలోనే ఉంటుంది. ఏ అవసరం వచ్చినా ఇక్కడి ప్రజలు విశాఖకే వెళ్తుంటారు. కేవలం ప్రభుత్వ పరమైన అవసరాలకు మాత్రమే విజయనగరం జిల్లాలోని కార్యాలయాలకు వెళ్తుంటారు.


శృంగవరపుకోట

విలీనంపై ఆశలు

- విశాఖ జిల్లాలో ఎస్.కోట కలపాలని డిమాండ్
- మరోసారి తెరపైకి జిల్లాల పునర్విభజన అంశం
- గత వైసీపీ ప్రభుత్వంలో శృంగవరపుకోటకు అన్యాయం
- న్యాయం చేస్తామని ఎన్నికల్లో మాటిచ్చిన చంద్రబాబు

శృంగవరపుకోట నియోజకవర్గాన్ని విశాఖపట్నం జిల్లాలో విలీనం చేసే ప్రతిపాదన మరోసారి తెరపైకి వచ్చింది. గతంలో వైసీపీ హయాంలో జిల్లాల పునర్విభజన జరిగినప్పుడు ఈ ప్రాంతీయులు విలీనాన్ని బలంగా కోరుకున్నారు. అయినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎన్నికల సమయంలో ఇక్కడికి వచ్చిన చంద్రబాబు విలీనం విషయంలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి సమస్యలను పరిశీలించడానికి ప్రభుత్వం తాజాగా మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. దీంతో ఎస్.కోట వాసులకు విలీనంపై ఆశలు చిగురించాయి.


● శృంగవరపుకోట నియోజకవర్గం విశాఖపట్నం జిల్లాకు దగ్గరగా ఉంది. వాణిజ్య, వ్యాపార పరంగాను ఈ ప్రాంత వాసులు విశాఖ వైపే చూస్తారు. జిల్లాల పునర్విభజన సమయంలో దీన్ని విశాఖలో విలీనం చేస్తే అన్ని విధాలా అభివృద్ధి చెందేది. విశాఖలో కలపాలని ఇక్కడి ప్రజలు పెద్ద ఉద్యమం చేసినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే దీన్ని సరిచేస్తాను. విశాఖ మహానగరంతో సమానంగా ఎస్.కోటను అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తాను.

-శృంగవరపుకోటలో జరిగిన సార్వత్రిక ఎన్నికల ప్రచార సభలో చంద్రబాబు ఇచ్చిన హామీ ఇది.



శృంగవరపుకోట, జూలై 26 (ఆంధ్రజ్యోతి):

జిల్లాల పునర్విభజన అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. జిల్లాల పేర్ల మార్పు, డివిజన్లు, మండలాలు, గ్రామాల సరిహద్దులపై ప్రజల నుంచి వచ్చిన విన్నపాలను పరిశీలించడానికి ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని తాజాగా ఏర్పాటు చేసింది. దీనికి ఏడుగురు మంత్రులను నియమించింది. పరిపాలనా సౌలభ్యం, వాస్తవిక పరిస్థితులు, చారిత్రక, భౌగోళిక, ఆయా ప్రాంతాల మధ్య ఆర్థిక, సామాజిక సమతుల్యతను పెంపొందించేలా జిల్లాల పునర్విభజనపై నిర్ణయం తీసుకోవాలని మంత్రుల కమిటీకి ప్రభుత్వం సూచించింది. ఈ అంశాలను బట్టి శృంగవరపుకోట నియోజకవర్గాన్ని విశాఖపట్నం జిల్లాలో విలీనం చేస్తారన్న ఆశ స్థానిక ప్రజల్లో కనిపిస్తోంది.


విశాఖపట్నం

పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం..

గత వైసీపీ ప్రభుత్వం 2022లో జిల్లాల (మిగతా 8వ పేజీలో..)

యూరియా కోసం బారులు

● రాజాంలో గంటల కొద్దీ రైతుల నిరీక్షణ ● అందరికీ అందని వైనం


రాజాంలోని ఓ దుకాణం వద్ద యూరియా కోసం రైతుల బారులు

రాజాం రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరత లేదని అధికారులు ఓవైపు స్పష్టం చేస్తుంటే రాజాంలో మాత్రం రెండు బస్తాల యూరియా కోసం రైతులు ఆరేడు గంటల పాటు క్యూలో బారులు తీరాల్సిన దుస్థితి నెలకొంది. అక్కడితో ఆగకుండా గులికల ప్యాకెట్లు కొంటేనే యూరియా ఇస్తామని అమ్మకందారు మెలిక పెట్టాడు. ఈ దుస్థితిపై రాజాంలోని ఓ ఎరువుల దుకాణం వద్ద రైతులు శనివారం ఆందోళనకు దిగారు. ఆరు వందలతో పోవాల్సింది రూ.వెయ్యి ఖర్చు చేయాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. వర్షాలతో అన్నదాతలంతా సాగుకు సన్నద్ధమయ్యారు. యూరియా కోసం పెద్ద సంఖ్యలో రైతులు శనివారం ఇక్కడి చీపురుపల్లి రోడ్‌లోని ఓ ఎరువుల గోదాం వద్దకు ఉదయం ఏడు గంటలకే చేరుకున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట (మిగతా 8వ పేజీలో)



కన్నపేగు కోసం ఆరాటం

● తల్లిదండ్రులకు దూరంగా బిడ్డలు
● ఫోన్‌లో పలకరింపులకే పరిమితం
● నేడు 'పేరెంట్స్ డే'

పిల్లల్ని కని, పెంచి, విద్యాబుద్ధులు నేర్పి.. ప్రయోజకుల్ని చేసిన తల్లిదండ్రులు చివరకు కన్నపేగు పలకరింతకే పరితపిస్తున్నారు. చేతుల్లో పెరిగిన పిల్లలు పెద్దవారు అయ్యాక తమకు దూరంగా ఉరుకులు.. పరుగుల జీవితాన్ని గడపడం చూసి ఆవేదన చెందుతున్నారు. వృద్ధాప్యంలో పిల్లల ఆసరా కోసం కొందరు, ఆత్మీయ స్పర్శం కోసం ఇంకొందరు ఎదురుచూస్తున్నారు. అందరూ వచ్చి తమతో ఒకరోజైనా గడపాలని కోరుకుంటున్న వారూ ఉన్నారు. ఆధునిక సాంకేతికత సాయంతో వీడియో కాల్‌లో మనవళ్లను చూసి మురిసిపోతూ అదో అలవాటుగా చేసుకున్న వారూ జిల్లాలో ఉన్నారు. 'పేరెంట్స్ డే' సందర్భంగా ప్రత్యేక కథనాలు 6లో

ప్రమాణ స్వీకారానికి ప్రముఖులు

గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన అశోక్‌గజపతిరాజు

విజయనగరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్‌గా పూసపాటి అశోక్‌గజపతిరాజు బాధ్యతల స్వీకారాన్ని చూసేందుకు జిల్లా నుంచి కూడా అనేక మంది ప్రముఖులు, టీడీపీ నాయకులు వెళ్లారు. ఆదివారం ప్రమాణస్వీకారం అనంతరం అశోక్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. సతీమణి సునీలా గజపతిరాజు ఆయన వెంటే ఉన్నారు. కాగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు నారా లోకేశ్, గుమ్మిడి సంధ్యారాణి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, పి.రాజేష్ వర్మ, సువ్వాడ రవిశేఖర్, ప్రసాదుల ప్రసాద్, అల్తి బంగారుబాబు, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్, భార్గవి తదితరులు హాజరయ్యారు.


ప్రమాణ స్వీకారానికి వెళ్తున్న అశోక్‌గజపతిరాజు

లోపాలు లేకుండా పరీక్ష నిర్వహించాలి

● డీఆర్‌వో శ్రీనివాసమూర్తి
● నేటి నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

విజయనగరం కలెక్టరేట్, జూలై 26(ఆంధ్రజ్యోతి): డిపార్ట్‌మెంట్ పరీక్షలు ఎటువంటి లోపాలు లేకుండా నిర్వహించాలని డీఆర్‌వో శ్రీనివాసమూర్తి ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై శనివారం తన చాంబర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం నుంచి డిపార్ట్‌మెంట్ పరీక్షలు జరగనున్నాయని, అందరూ సమన్వయంతో వ్యవహరించి, పరీక్షలను విజయవంతం చేయాలన్నారు. పరీక్షలు ఈనెల 27 నుంచి వచ్చే నెల ఒకటి వరకూ అయాన్ డిజిటల్, లెండి కళాశాలలో జరుగుతాయని చెప్పారు. విభిన్న ప్రతిభావంతులు పరీక్ష రాసేందుకు అదనంగా 20 నిమిషాలు స్క్రయిబ్‌లకు అనుమతించాలని చెప్పారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని, తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయలని, తాగునీటిని అందుబాటులో ఉంచాలన్నారు. సెల్‌ఫోన్లు, ఇతర ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. సిబ్బంది కూడా సెల్‌ఫోన్లను పరీక్ష కేంద్రాల్లోకి తీసుకువెళ్లకూడదన్నారు. ఉదయం పరీక్షకు 8.30 నుంచి 9.15 వరకూ, మధ్యాహ్నం పరీక్షకు 1.30 నుంచి 2.15 వరకూ మాత్రమే అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తామన్నారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి అవకతవకలు చోటుచేసుకున్నా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటిండెంట్లే బాధ్యత వహించాల్సి ఉంటుందని డీఆర్‌వో చెప్పారు. సమావేశంలో ఏపీపీఎస్‌సి సెక్షన్ ఆఫీసర్లు వీవీ నవజ్యోతి, నాగలక్ష్మి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ భాస్కరరావు తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న డీఆర్‌వో శ్రీనివాసమూర్తి


ఆంద్ర జలాశయం

సాగునీటి గలగలలే

● 'ఆంద్ర' నుంచి నేడు నీరు విడుదల
● హాజరుకానున్న మంత్రులు

మెంటాడ, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఆంద్ర జలాశయం కుడి, ఎడమ కాల్వలు జలకళను సంతరించుకోనున్నాయి. సాగునీటి గలగలలతో తొణికిసలాడనున్నాయి. రెండింటికీ ఆదివారం నీరు విడుదల చేయనున్నారు. కాల్వల ఆధునికీకరణ పనులు పూర్తికావడంతో శివారు పొలానికి నీరు అందుతుందని రైతులు భావిస్తున్నారు. నీటి విడుదలతో మెంటాడ, గజపతినగరం, బొండపల్లి మండలాల రైతులకు మేలు జరగనుంది. మంత్రులు గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్ హాజరై సాగునీరు విడుదల చేయనున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కాల్వల నుంచి నీరు సక్రమంగా విడుదల కాక రైతులు ఇబ్బందులు పడేవారు. కాల్వలు పూడికపోయి నీరు పారక శివారు ఆయకట్టు రైతులు నీటిపై ఆశలు వదులుకునేవారు. స్థానిక టీడీపీ నాయకులు, రైతులు ఈ సమస్యను మంత్రి సంధ్యారాణి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆమె ప్రభుత్వం దృష్టిలో పెట్టారు. కోటి రూపాయలు విడుదల చేశాక పనులు పరుగులు తీశాయి. కాలువల్లో జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. పూడికలు, మట్టికట్టపై పొదలను తొలగించారు. కాలువలు నీరు పారేందుకు వీలుగా మారడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

● వైసీపీ ప్రభుత్వంలో సుమారు రూ.16 కోట్ల జైకా నిధులతో జలాశయం ఆధునికీకరణ పనులు చేపట్టినట్లు చెప్పుకొచ్చారు. ఎక్కడా అభివృద్ధి మాత్రం కానరాలేదు. నేటికీ జలాశయం ముఖద్వారం గేట్లు ద్వారా (మిగతా 8వ పేజీలో)


ఐక్యతను చాటుతున్న సీపీఐ నాయకులు

అవే స్మార్ట్ మీటర్లు పెట్టేస్తున్నారు 8లో

● మానవీయ సమాజ నిర్మాణమే లక్ష్యం
● సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి నాగేశ్వరరావు

ప్రతి ఉద్యోగీ దత్తత తీసుకోవాలి

● బంగారు కుటుంబాలను ఆదుకోవాలి
● ఇన్‌చార్జి కలెక్టర్ సేతు మాధవన్


మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ సేతుమాధవన్

విజయనగరం కలెక్టరేట్, జూలై 26(ఆంధ్రజ్యోతి): పీ4 కార్యక్రమంలో భాగంగా ప్రతి ఉద్యోగి బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని మార్గదర్శులుగా నిలవాలని ఇన్‌చార్జి కలెక్టర్ సేతు మాధవన్ సూచించారు. పీ4 కార్యక్రమంపై శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా, డివిజన్, మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకునేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారని, ఆయన స్వయంగా 250 కుటుంబాలను దత్తత తీసుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రిని ఆదర్శంగా తీసుకుని జిల్లాలోని అధికారులు, సిబ్బంది ఒకటి కంటే ఎక్కువ కుటుంబాలను దత్తత తీసుకోవాలని చెప్పారు. జిల్లాకు నిర్దేశించిన 67 వేల లక్ష్యం మేరకు ప్రతి గ్రామంలో బంగారు కుటుంబాలు, మార్గదర్శులను గుర్తించాలని నిర్దేశించారు. ఈ స్వచ్ఛంద కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. వచ్చే నెల 5వ తేదీలోగా పారిశ్రామికవేత్తలు, ఉద్యోగులే కాకుండా ఇతర రంగాలకు చెందిన వారు కూడా వారి వద్ద పని చేస్తున్న కుటుంబాలను లేదా ఇతర పేద కుటుంబాలను దత్తత తీసుకుని, తోడ్పాటు అందించేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు.

కాల్ సెంటర్ 1100ను వినియోగించుకోండి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) అర్జీదారులు కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ సేతు మాధవన్ ఒక ప్రకటనలో కోరారు. అర్జీలు పరిష్కారం కాకపోయినా, సమాచారం తెలుసుకోవడానికైనా ఈ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

- తల్లిదండ్రులకు దూరంగా బిడ్డలు ● ఉపాధి కోసం వెళ్లక తప్పని వైనం
- ఫోన్‌లో పలకరింపులకే అధిక శాతం పరిమితం
- బాధ్యతలను మరచిపోని వారు ఎందరో..

నేడు 'పేరెంట్స్ డే'

కన్నపేగు కోసం ఆరాటం



ఏ తల్లిదండ్రులైనా పిల్లలను ప్రాణపదంగా ప్రేమిస్తారు. కాలక్రమంలో ఉపాధి.. ఉద్యోగాన్వేషణలో భాగంగా తల్లిదండ్రులకు దూరంగా పిల్లలు ఉండాల్సి వస్తోంది. కొందరైతే కుటుంబ పోషణ కోసం తప్పనిసరిగా దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. నిత్యం పలుకరించే కుటుంబ అవసరాలు... వేధించే ఆర్థిక సమస్యలు... కనుచూపుమేర కనిపించని ఉపాధి అవకాశాలు... మరికొందరిని విదేశాల బాట పట్టిస్తుంటాయి. అక్కడ ఉద్యోగావకాశాలు బాగున్నా.. ఆర్థిక అవసరాలను దాటగలుగుతున్నా... కన్నబిడ్డలు కళ్ల ముందు లేరనే దిగులు తల్లిదండ్రులను వెంటాడుతోంది. కొందరు బిడ్డలు విదేశాల్లో ఉన్నత స్థాయిలో ఉన్నా...చేతి నిండా డబ్బులు ఉంటున్నా... ఇక్కడి వారి తల్లిదండ్రులు వృద్ధాప్యంలో పొరుగు వారి సాయానికై వేచి చూడాల్సిన పరిస్థితి. ఎంతదూరంలో ఉన్నా..తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకుంటున్న వారు కొందరైతే... మరచిపోతున్న వారు కొందరు. ఇక బిడ్డలు దూరంగా ఉంటున్నారని నిరాశ చెందుతున్న తల్లిదండ్రులు కొందరైతే... ఎంతదూరంలో ఉన్నా... అభిమానాన్ని చాటుకోవడం కష్టంగా కాదని ఆశావాద దృక్పథంతో ముందుకెళుతున్న తల్లిదండ్రులు కొందరు. ఆదివారం 'పేరెంట్స్ డే' సందర్భంగా అలాంటి కొందరు తల్లిదండ్రుల గురించి తెలుసుకుందాం.

ముగ్గురు పిల్లలతో గడపాలని ఉంది..

శృంగవరపుకోట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): 'మాకు ముగ్గురు పిల్లలు. వీరిలో ఒకరు జిల్లా స్థాయి ఉన్నత ఉద్యోగి. మరొకరు వైద్యుడు. ఇంకొకడు చిరుద్యోగి. భార్యాభర్తలు ఉద్యోగులు కావడంతో అతడికీ ఆర్థికంగా ఫర్వాలేదు. నేను ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశాను. క్షేత్ర స్థాయిలో పని చేసే ఉద్యోగిని కావడంతో నా భర్త అప్పట్లో సైకిల్‌పై నన్ను ఓ పక్క తిప్పుతూ, మరో పక్క చిన్న చిన్న వ్యాపారాలు చేసేవారు. తద్వారా కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేవారు. ప్రభుత్వ ఉద్యోగమైనప్పటికీ... అప్పట్లో జీతాలు తక్కువ. ఇంటి అద్దెలు, కుటుంబ జీవనానికి కూడా జీతం సరిపోయేది కాదు. ప్రణాళికాబద్ధంగా నడుచు కుంటూ పిల్లలు ముగ్గురినీ చదివించడంతో ఉద్యోగాలు వచ్చాయి. ఉద్యోగ రీత్యా పిల్లలు ముగ్గురూ కుటుంబాలతో దూరంగా ఉంటున్నారు. అయినప్పటికీ మమ్మల్ని కంటికి రెప్పలా చూసుకుంటున్నారు. మాకు ఆరోగ్యం బాగాలేదని తెలిస్తే చాలు.. ముగ్గురులో ఎవరో ఒక్కరు వచ్చి వాలి పోతారు. వారి చెంతకు తీసుకుపోతారు. కానీ మేం అక్కడ ఉండలేం. ఆరోగ్యం కాస్త కుదుటపడగానే సొంత ఊరికి వచ్చేస్తాం. ఏడాదికి ఒక్కసారైనా ఓ పది రోజుల పాటు ముగ్గురు పిల్లల కుటుంబాలు మాతో గడిపితే బాగు టుందని ఆశ. కానీ ఉద్యోగ జీవితంలో ఉన్నందున ఒకరికి వచ్చేందుకు అవకాశం ఉంటే.. మరొకరికి కుదరదు. వాళ్ల పరిస్థితులు తలచుకుని మిన్నకుండిపోతాం. ముగ్గురు పిల్లల కుటుంబాలతో ఒక్కసారైనా గడపాలన్న మా కోరిక తీరుతుందో లేదో..ఇదీ శృంగవరపుకోట పట్టణానికి చెందిన దాదాపు 85 ఏళ్ల వయసులో ఉన్న వృద్ధ దంపతుల ఆవేదన. 'ఈ ముసలి ప్రాణాలు గాలిలో కలిసే లోపు ఒక్కసారైనా అందరం కలసి ఓ పది రోజులు ఒకే చోట కలిసి ఆనందంగా గడిపేందుకు అవకాశం కల్పించాలని ఆ భగవంతుని వేడుకుంటున్నాం' అంటున్నారా తల్లిదండ్రులు.

ప్రేమగా చూస్తున్నారు..



అల్లు స్వామినాయుడు, హైమావతి

బొబ్బిలి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): 'మాకు ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడు కిరణ్ సునీల్ సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా లండన్‌లో పని చేస్తున్నాడు. భార్య, ఇద్దరు కూతుళ్లతో సంతోషంగా గడుపుతున్నాడు. మా పట్ల ఎంతో ఆదరాభిమానాలు చూపుతారు. ఏడాదికోసారి మేం వారి ఇంటికి వెళ్లకుంటే వారే బొబ్బిలి వచ్చి కొన్నాళ్లు గడిపి వెళుతుంటారు. మాకు డబ్బు మీద ధ్యాస లేదు. ప్రేమానురాగాలు, ఆత్మీయ బంధాలకు మాత్రమే అత్యంత విలువ ఇస్తుండడంతో సంతోషంగా ఉండగలుగుతున్నాం. నా కుమార్తె వెంకటశైలజ తన భర్తతో కలిసి కెనడాలో ఉంటోంది. మా పట్ల అమితమైన ప్రేమాభిమానాలు కురిపిస్తారు. వీలైతే మేం కెనడా వెళుతుంటాం. లేకుంటే వారే మమ్మల్ని చూడడానికి ఇక్కడికి వస్తుంటారు. కుమారుడు, కోడలు, మనుమరాళ్లు వారానికి మూడుసార్లు, కుమార్తె, అల్లుడు, పిల్లలు వారానికి రెండుసార్లు తప్పనిసరిగా ఫోన్‌లో మాట్లాడుతారు. ఎంతోమందితో పోల్చుకుంటే సంతానం విషయంలో.. వారి ఆదరాభిమానాల విషయంలో మా పరిస్థితి బాగుంటుందని చాలా గర్వంగా చెప్పుకుంటాం' అంటున్నారు బొబ్బిలికి చెందిన రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి అల్లు స్వామినాయుడు, హైమావతి దంపతులు.

వృద్ధాప్యంలో ఒంటరిగా...

బొబ్బిలి పట్టణానికి చెందిన ఓ రిటైర్డ్ టీచరు 85 ఏళ్ల వయస్సులో భార్యతో కలిసి అత్యంత దైన్యంగా, ఒంటరిగా జీవిస్తున్నారు. ఆస్తిపాస్తులకు కొదువ లేదు. వీరి ఇద్దరు పిల్లలు విదేశాల్లో స్థిరపడ్డారు. వృద్ధులైన తల్లిదండ్రులు ఇక్కడ దయనీయంగా నెట్టుకొస్తున్నారు. ఆప్యాయంగా, సరదాగా తమ పిల్లలు, వారి వారసులతో గడుపుకునే అవకాశం లేదని రోదిస్తున్నారు. తమను సాకడం లేదన్న మనోవేదనతో వారు కుంగిపోతున్నారు. ఆ వృద్ధ దంపతులు ఎదుర్కొంటున్న దయనీయమైన దుస్థితి ఇంకే తల్లిదండ్రులకు రాకూడదని స్థానికులు చెప్పుకుంటున్నారు. తమ వారు ఎలా ఉంటున్నారోనన్న కనీస ధ్యాస కూడా పిల్లలకు లేదని నిష్ఠూరమాడుతున్నారు. 'మా పిల్లలు చెడ్డవారు కాదు. కానీ మమ్మల్ని చూసుకునే వెసులుబాటు, వీలు కల్పించుకోకపోవడమే బాధ కలిగిస్తోంది' అని నీరు నిండిన కళ్లతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారా తల్లిదండ్రులు.

బిడ్డలను చూసి నాలుగేళ్లయింది..

గజపతినగరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్నపాటి ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ... పిల్లలను ఉన్నత చదువులు చదివించారా తల్లిదండ్రులు. ఇద్దరు కుమారులు అమెరికా, లండన్‌లలో కుటుంబాలతో స్థిరపడ్డారు. నాలుగేళ్ల నుంచి కొడుకులు, కోడళ్లు స్వగ్రామానికి రాలేదని తల్లిదండ్రులు చెబుతున్నారు. మనవళ్లు, మనవరాళ్ల చదువుల కారణంగా కొడుకులు రాలేకపోతున్నారని అంటున్నారు. తాము వృద్ధాప్యంలోకి వస్తున్నామని.. రాబోయే రోజుల్లో తమ పరిస్థితి ఏవిధంగా ఉంటుందోననే మానసిక వేదనకు గురవుతున్నారా కన్నవారు. ఎవరికైనా వృద్ధాప్యంలో కొడుకులు, కోడళ్లు, మనవలతో గడపాలన్న కోరిక ఉంటుంది. కానీ తమకు ఆ అదృష్టం లేదని నిష్టూరుస్తున్నారా తల్లిదండ్రులు. అత్యవసర సమయాల్లో ఇంటి చుట్టుపక్కల వారిని సాయం కోసం అర్థించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారు కూడా అందుబాటులో లేని రోజు కాళ్లీడ్చుకుంటూ మందులకు వెళ్లాల్సి వస్తోందని కన్నీటిపర్యంతమవుతున్నారు.

అందరూ ఉన్నా.. ఒంటరిగానే..

చీపురుపల్లి, జులై 26 (ఆంధ్రజ్యోతి): ఆయనొక విశ్రాంత ప్రభుత్వోగి. ఆయనకు ఇద్దరు కొడుకులు. వారి భార్యలు, మనుమలు, మనుమరాళ్లు, వియ్యంకులు.. బంధువులు అంతా కలిపితే కుటుంబ సభ్యుల సంఖ్య పదుల్లోనే ఉంటుంది. అంతమంది ఉన్నా.. ఇప్పుడు ఆదరించే వారు లేక... కష్టమొస్తే ఆదుకొనే వారు లేక అనాథలా బతుకుతున్నారు. ఆయన సర్వీసులో ఉండగానే కొడుకులిద్దరినీ బాగా చదివించి.. ఉద్యోగాల కోసం విదేశాలకు పంపించారు. కొన్నాళ్ల పాటు అక్కడే ఉండి... నాలుగు పైసలు వెనకేసుకొస్తారని ఆశ పడ్డారు. కానీ డబ్బు సంపాదనలో పడిన ఆ పిల్లలు స్వదేశానికి తిరిగి రావడానికి నిరాకరించారు. ఇంతలో ఆ విశ్రాంత ఉద్యోగి భార్య అనారోగ్యంతో కన్నుమూసింది. దీంతో ఆయన ఒంటరిగా మిగిలారు. తన సహధర్మచారిణి దూరమై.. విదేశాల్లో ఉన్న పిల్లలు ఇక్కడికి రావడానికి నిరాకరించడంతో ఆవేదన చెందుతున్నారు. వండి, వడ్డించడానికి ఇంట్లో కావలసినంత మంది పనివారున్నా... మనసు విప్పి మాట్లాడే మనుషుల కోసం ఆయన పరితపిస్తున్నారు. కష్టమైనా, సుఖమైనా ఫోన్ కాలే శరణ్యమంటూ కుమిలిపోతున్నారు.

పిల్లలు దగ్గర లేరనే బాధ..

సాలూరు రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సాలూరు నియోజకవర్గంలోని ఓ గ్రామంలో భార్యాభర్తలు ఇద్దరూ ఉపాధ్యాయులే. ఇటీవల భర్త మరణించారు. ఈ దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు. వారిలో ఒకరు అమెరికాలో.. మరొకరు హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఇద్దరు పిల్లలు దూరంగా ఉండడంతో ఆమె ఒక్కరే ఇంట్లో ఉంటున్నారు. 'ఉద్యోగ బాధ్యతలతో రోజంతా బిజీగా గడుపుతున్నా... ఇంటికి వచ్చే సరికి ఏదో వెలితి. పిల్లలు దగ్గర ఉంటే బాగుండుననే కోరిక. రోజూ వీడియో కాల్‌లో వారితో మాట్లాడుతున్నా. కానీ వాళ్లు నా వద్ద ఉంటే బాగుంటుందనే ఆశ. నా స్వార్థం కోసం వారి భవిష్యత్, ఆశలను కాదనలేం కదా అని మనస్సుకు సర్దిచెప్పుకుంటా. దూరంగా ఉన్నా... రోజూ వీడియో కాల్ చేసి చూస్తున్నాం కదా అని తృప్తితో గడిపేస్తున్నా అంటున్నారా ఉపాధ్యాయురాలు.

బతుకులు బాగుండాలని...

ఆ దంపతులు ఇద్దరూ ఉపాధ్యాయులుగా రిటైరయ్యారు. వారికి ఓ కుమార్తె, కుమారుడు. ఇద్దరికీ వివాహాలై అమెరికాలో ఉంటున్నారు. రెండేళ్లకు ఓసారి తల్లిదండ్రుల వద్దకు వస్తుంటారు. ఒక్కొక్కసారి వీరినే అమెరికా తీసుకెళతారు. అలా తల్లిదండ్రులకు దూరంగా ఉన్నా... వారిపై అనురాగం, ఆపాయ్యతలను చూపుతున్నారు. పిల్లలు తమతో ఉండాలనే కోరిక ఉన్నా... వారి బతుకులు బాగుండాలనే ఉద్దేశంతో మనసుకు సర్దిచెప్పుకుంటున్నామని అంటున్నారా తల్లిదండ్రులు. రోజూ వీడియో కాల్‌లో పిల్లలతో మాట్లాడుతున్నామని సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఆనందంగా ఉండడానికి ప్రయత్నించండి..

పిల్లలకు దూరంగా ఉంటున్న తల్లిదండ్రులు నిత్యం ఆనందంగా ఉండడానికి ప్రయత్నించాలని సాలూరుకు చెందిన వైద్యుడు వాడాడ గణేశ్వరరావు సూచిస్తున్నారు. తల్లిదండ్రులు అభద్రతాభావానికి లోనుకాకూడదన్నారు. ప్రస్తుతం సాంకేతికత అందుబాటులో ఉందని.. వీడియో కాల్, జూమ్ కాల్ తదితర వాటితో వారి ఖాళీ సమయాల్లో మాట్లాడాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు రాకుండా జాగ్రత్తలు పాటించాలని... ఆరోగ్య బీమా చేయించుకుంటే మేలని చెబుతున్నారు. తాము ఉంటున్న ప్రాంతాల్లో ఫ్యామిలీ క్లబ్‌లు ఏర్పాటు చేసుకోవాలి. వాటిలో వినోద, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ఆటల పోటీలు వంటివి నిర్వహించుకుంటే మానసిక ధృఢత్వం పొందడానికి అవకాశం ఉంటుందని చెబుతున్నారు.



సదస్సులో మాట్లాడుతున్న అదనపు డీఎంహెచ్‌వో రాణి

ఆరోగ్యవంతమైన జీవనానికి పరిశోధనలు అవసరం

- అదనపు డీఎంహెచ్‌వో రాణి

నెల్లిమర్ల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన జీవనానికి పరిశోధనలు, నవకల్పనలు ఎంతగానో దోహదపడతాయని అదనపు డీఎంహెచ్‌వో కె.రాణి అన్నారు. గత మూడు రోజులుగా సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ఇన్నోవేషన్ ఇన్ హెల్త్ కేర్ స్మార్ట్ అండ్ అడ్వాన్స్‌డ్ అప్లికేషన్స్-2025 సదస్సు శనివారంతో ముగిసింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కరోనా ముందు నాటి పరిస్థితులు, ఆ తరువాత పరిస్థితుల్లో మార్పులు వచ్చాయన్నారు. నేడు అంతా స్మార్ట్‌లైఫ్‌కు అలవాటుపడ్డారన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ఉపయోగించి 24వేల మందికి ఎక్స్‌రేలు తీయగలిగామన్నారు. ప్రభుత్వం కూడా మొబైల్ హెల్త్ యాప్, ఆరోగ్య సేతు, ఆయుష్మాన్ భారత్, ఇ-హాస్పిటల్స్ వంటి సౌకర్యాలను కల్పించిందని తెలిపారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మహంతి మాట్లాడుతూ అంతర్జాతీయ సదస్సు విజయవంతంగా ముగిసిందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.పల్లవి, ఒడిశా టెలికాం శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎం.మురళీకృష్ణ, డీన్లు డాక్టర్ విజయ్‌బాబు, డాక్టర్ శ్రీనివాసరావు, ఐక్యూఏసీ డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డాక్టర్ పీఎస్వీ రమణరావు, విభాగాధిపతి శ్రావణి, విద్యార్థులు పాల్గొన్నారు.



స్పిల్‌వే గేట్ల నుంచి దిగువకు వెళుతున్న నీరు

నాగావళికి తగ్గిన వరద ప్రవాహం



నీటిని విడిచి పెడుతున్న దృశ్యం

గరుగుబిల్లి, జూలై 26(ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదికి శనివారం వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. శుక్రవారం మూడు వేల క్యూసెక్కులకు పైగా వరద చేరగా.. శనివారానికి పైనుంచి రెండు వేల క్యూసెక్కులు మాత్రమే చేరింది. నది దిగువ ప్రాంతాలకు 1,200 క్యూసెక్కుల నీటిని స్పిల్‌వే నుంచి విడుదల చేశారు. ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 103.79 మీటర్ల నిల్వ సామర్థ్యం ఉంది. కుడి ప్రధాన కాలువ, పాత రెగ్యులేటర్ పరిధిలోని ఎడమ ప్రధాన కాలువల నుంచి ఖరీఫ్ కోసం 1,150 క్యూసెక్కులు విడుదల చేశారు. భారీ వర్షాలు కురిస్తే స్పిల్‌వే నుంచి దిగువకు మళ్లించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నామని ప్రాజెక్టు ఈఈ హెచ్.మన్మథరావు తెలిపారు.

గోముఖిలోకి నీరు విడుదల..

మక్కువ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎగువన కురుస్తున్న వర్షాలతో శంబర సమీపంలో గల గోముఖి రిజర్వాయర్‌లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో గోముఖి నదిలోకి సుమారు వంద క్యూసెక్కుల నీటిని శనివారం విడిచిపెట్టారు. వరదనీరు ఎక్కువైతే మరికొన్ని క్యూసెక్కులు విడిచి పెట్టనున్నట్టు గోముఖి రిజర్వాయర్ జేఈ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. నదీ పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

కాలగర్భంలోకి

సింహాచలం మేడ

విజయనగరం కల్చరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విజయనగరం పేరు చెబితే ఎన్నో చారిత్రక కట్టడాలు కళ్లముందు కదలాడుతాయి. మూడు లాంతర్లు, కోట, గంటస్తంభం, గుమ్చీ, బొంకులదిబ్బ ఇలా అనేక ప్రదేశాలు విజయనగరం చరిత్రకు ఆనవాళ్లు. వీటిలో ఒకటి సింహాచలం మేడ. కోట కూడలి నుంచి లంకవీధి జంక్షన్ వద్ద ఉన్న సింహాచలం మేడ కాలగర్భంలో కలసిపోతోంది. ఈ కూడలి నుంచి ఇటు తూర్పున లంకవీధికి వెళ్లడానికి, పడమర కాంప్లెక్స్‌కు, దక్షిణాన అయోధ్య మైదానం, ఉత్తరాన కోటకు వెళ్లే మార్గాలు ఉన్నాయి. ఇలా అన్నిటికీ కేంద్ర బిందువైన సింహాచలం మేడను గత కొన్ని రోజుల నుంచి కూల్చివేసే కార్యక్రమం కొనసాగుతోంది. మాన్సాస్ సంస్థ పరిధిలోకి వచ్చే ఈ భవనంలో చాలా రోజులు నిరుపేద, పేద, మధ్య తరగతి వారి కోసం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రాథమిక వైద్యాలయం, జనరిక్ మందుల షాపు నిర్వహించేవారు. సుమారు ఇరవయ్యేళ్లుగా ఇక్కడ పేద, మధ్యతరగతి వారు ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకునేవారు. కొన్ని వైద్య పరీక్షలకు అతి తక్కువ మొత్తంలో తీసుకుని రోటరీ క్లబ్ సేవలు అందించేది. అలా విభిన్నరకాలుగా సేవలందించిన ఆ భవనం కనుమరుగవుతోంది. మాన్సాస్ సంస్థ ఈ భవనం స్థానంలో ఏది నిర్మించినా సింహాచలం మేడఆనవాలు ఉండేలా చూడాలని నగర ప్రజలు కోరుతున్నారు.



సింహాచలం మేడను కూల్చుతున్న దృశ్యం

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తగ్గించండి



నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

విజయనగరం కలెక్టరేట్ జూలై 26 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ప్రారంభమైన నాటి నుంచి ఉపాధ్యాయులు బోధన కంటే బోధనేతర పనులకే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోందని యూటీఎఫ్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం యూటీఎఫ్ ఆధర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘ నాయకులు మాట్లాడుతూ యోగాంధ్ర, మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం, శిక్షణ తరగతుల పేరుతో అనేక కార్యక్రమాలు ఉపాధ్యాలను బోధనకు దూరం చేశాయని అన్నారు. ఇవి కాకుండా ప్రతి రోజు ఏదో ఒక సమాచారం అత్యవసరమంటూ విద్యాశాఖ యాప్‌లో అప్‌లోడ్ చేయమంటోందని తెలిపారు. ఉపాధ్యాయలపై పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి పాఠాలు చెప్పకుండా బోధనేతర పనులు అప్పగిస్తోందన్నారు. ఉపాధ్యాయలు బదిలీలు పూర్తయి నెల రోజులు గడిచినా ఇప్పటికీ వేలామంది రిలీవ్ కాలేదని నిరసన వ్యక్తం చేశారు. వేలాది పాఠశాలల్లో సింగిల్ టీచర్లు కొనసాగుతున్నారని.. పేరుకే ఐదుగురు టీచర్లను ఇచ్చినా అనేక చోట్ల ఇద్దరే పని చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు ఉపాధ్యాయులు సెలవులు వినియోగించుకునే స్వేచ్ఛ లేకుండా ఆంక్షలు విధిస్తున్నారని అన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు గత రెండు నెలలు జీతాలు ఇవ్వలేదని, అయినా పట్టించుకోలేదన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఈశ్వరరావు, శ్రీనివాసరావు, విజయగౌరి, రాము తదితరులు పాల్గొన్నారు.

ఒక ప్రాంగణం.. రెండు రైతుబజార్లు

- ఇద్దరు ఎస్టేట్ అధికారులు



దాసన్నపేట రైతుబజారు

విజయనగరం రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా కేంద్రంలో నిన్నటి వరకూ మూడు రైతు బజార్లు ఉండేవి. నేడు రెండే దర్శనమిస్తున్నాయి. దాసన్నపేట రింగురోడ్డు, పాత మహారాజా ఆసుపత్రి, ఆర్ అండ్ బీ వద్ద మూడు రైతు బజార్లు ఉండేవి. దీంతో నగర ప్రజలు మూడు ప్రాంతాల్లో ఉన్న రైతుబజార్ల సేవలను వినియోగించుకునేవారు. తాజాగా పాత మహారాజా ఆసుపత్రి వద్ద ఉన్న రైతు బజారును తాత్కాలికంగా మూసేశారు. ఈ బజార్‌ను నిర్వహించే స్థలం మాన్సాస్ పరిధిలో ఉండడంతో ఖాళీ చేయాలని మార్కెటింగ్ శాఖాధికారులు ఆదేశించారు. ఈ నెల 19 నుంచి ఎంఆర్‌హెచ్ రైతు బజారును తాత్కాలికంగా మార్పుతున్నట్టు బోర్డు ఏర్పాటు చేశారు. ఈ బజారును వేరొక బజారులో విలీనం చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. దీనికి అక్కడి రైతులు, దుకాణాల నిర్వాహకులు ముందుకు రాలేదు. అదే సమయంలో సీపీఎం ఆధ్వర్యంలో రైతు బజారు అక్కడే కొనసాగించాలని నిరసనలు, ధర్నాలు చేపట్టిన సంగతి విదితమే. కొంత మంది రైతులు కొద్ది రోజులు ఎంఆర్‌హెచ్ గేటు బయట కూరగాయల విక్రయాలు చేపట్టారు. తాజాగా ఆ రైతులంతా ప్రస్తుతం దాసన్నపేట రింగురోడ్డు రైతుబజారులో ఉన్నారు. ఇక నుంచి రెండు బజార్లు ఇక్కడే కొనసాగుతాయని అధికారులు చెబుతున్నారు. ఒకే గదిలో ఇద్దరు ఎస్టేట్ అధికారులు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఒకవైపు పాతమహారాజా ఆసుపత్రికి సంబంధించిన రైతుబజారును.. మరోవైపు రింగురోడ్డు రైతుబజారును నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఇద్దరు ఎస్టేట్ అధికారులతో పాటు, ఇద్దరు సూపర్‌వైజర్లు, నలుగురు గార్డులు పనిచేస్తున్నారు. ఎంఆర్‌హెచ్ రైతు బజారు కోసం నగరంలో రెండు మూడు ప్రాంతాల్లో స్థల పరిశీలన చేసినట్టు అధికారులు చెబుతున్నారు. అంది ఇంకా కొలిక్కిరాలేదు.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట, జూలై 26(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శనివారం ఆమె లక్కవరపు కోటలోని తన నివాసం వద్ద బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం రూ.10లక్షల 44వేల 670 విలువ గల చెక్కులను అందజేసినట్టు తెలిపారు.

మిరాకిల్‌లో జాబ్‌మేళా

భోగాపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ముంజేరు సమీప మిరాకిల్ ఎడ్యుకేషన్ సొసైటీలో నైపుణ్య అభివృద్ధి శాఖ సహకారంతో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి పాల్గొన్నారు. మేళాలో ఎంపికైన వారికి ఆఫర్ లెటర్స్ అందజేశారు. ఈ మేళాకు 2,500 మంది హాజరు కాగా, 751మంది ఎంపికయ్యారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ అర్జునరావు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ ఈఈగా ప్రసాద్

విజయనగరం టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విజయనగరం నగరపాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పీఎస్‌వీవీ ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడే డిప్యూటీ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న ఆయనకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పదోన్నతి లభించింది. ఈసందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నగరంలోని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు.

లోకేశ్‌ను కలిసిన అవనాపు విజయ్, భార్గవి



లోకేశ్‌తో అవనాపు విజయ్, భార్గవి

విజయనగరం రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ని టీడీపీ విజయనగరం నాయకులు అవనాపు విజయ్, భార్గవిలు శనివారం గోవాలో కలిశారు. గోవా రాష్ట్ర గవర్నర్‌గా అశోక్ గజపతిరాజు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి లోకేశ్ హాజరయ్యారు. అదే కార్యక్రమానికి అవనాపు విజయ్, భార్గవీలు హాజరయ్యారు. అనంతరం లోకేశ్‌ని కలిసి, విజయనగరంలో పార్టీ పరిస్థితిపై చర్చించారు. పార్టీ కోసం కష్టించి పనిచేయాలని, విజయనగరంలో పార్టీని మరింత ముందుకు తీసుకువెళ్లాలని లోకేశ్ సూచించారు.

అర్హులకు వితంతు పింఛన్లు మంజూరు చేయాలి

నెల్లిమర్ల, జూలై 26(ఆంధ్రజ్యోతి): అర్హులకు వితంతు పింఛన్లు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఎం.పాపారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కొండగుంప గ్రామ సచివాలయం పరిధిలో సుమారు 20 మంది వితంతువులు, వృద్ధులు దరఖాస్తులు చేసుకుని సంవత్సరం గడుస్తున్నా ఇంతవరకు ఏ ఒక్కరికీ పింఛన్ మంజూరు చేయకపోవడం అన్యాయమన్నారు. సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

వసతిగృహ సమస్యలను పరిష్కరించండి



సర్వేయర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

శృంగవరపుకోట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట గిరిజన కళాశాల వసతిగృహ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పుణ్యగిరి రోడ్డులోని వసతిగృహం నుంచి విద్యార్థులతో కలిసి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. అక్కడ నిరసన తెలిపారు. వినతిపత్రం అందజేసేందుకు కార్యాలయం లోపలికి వెళ్లబోతే పోలీసులు గేటు వద్ద అడ్డుకున్నారు. దీంతో ఎస్ఎఫ్ఐ నాయకులు మండిపడ్డారు. అనంతరం కార్యాలయం గేటు వద్ద సర్వేయర్ రమకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వి.చినబాబు, పి.రమేష్, భారతి, రత్న, అనిత, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతానందన్ ఆశయాలు కొనసాగించాలి

రాజాం రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కేరళ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ వీఎస్ అచ్యుతానందన్ ఆశయాలను కొనసాగించాలని కార్మిక నాయకుడు రామ్మూర్తినాయుడు అన్నారు. శనివారం రాజాంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సంతాపసభలో ఆయన పాల్గొని, అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.

బస్తాకు రెండు కిలోల తరుగు!

- చీపురుపల్లి ఎంఎల్ఎస్ పాయింట్ తీరుపై మెరకముడిదాం మండల రేషన్ డీలర్ల ఫిర్యాదు

మెరకముడిదాం, జూలై 26(ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి ఎంఎల్ఎస్ పాయింట్ ద్వారా మెరకముడిదాం మండలంలోని అన్ని రేషన్ డిపోలకు పంపిణీ చేస్తున్న బియ్యంలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని డీలర్ల సంఘం జిల్లా డివిజన్ ఉపాధ్యక్షుడు కెంగువ శ్రీను, మండల అధ్యక్షుడు సుంకరి జయసింహ ఆరోపించారు. ఈ మేరకు మండలంలోని డీలర్లతో కలిసి శనివారం స్థానిక తహసీల్దార్ సులోచనారాణి ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో అన్ని ప్రజాపంపిణీ రేషన్ షాపులకు పంపిణీ చేసే పేదల బియ్యంలో చీపురుపల్లి ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద 50 కిలోల బస్తాకు సుమారుగా ఒకటి, రెండు కిలోల బియ్యం తరుగు రావడంతో డీలర్లు లబోదిబోమంటున్నారని తెలిపారు. దీనిపై చీపురుపల్లి ఎంఎల్ఎస్ పాయింట్‌కు వెళ్లి అడిగితే.. ఎండీ ఇచ్చిన కాటాతోనే తూస్తున్నామని, ఇష్టం ఉంటే సరుకులు విడిపించవచ్చు లేకపోతే వెళ్లిపోవచ్చని గోడౌన్ ఇన్‌చార్జి సన్యాసిరావు సమాధానం ఇచ్చారని చెప్పారు. దీంతో చీపురుపల్లి ఆర్డీవోకు, మెరకముడిదాం తహసీల్దార్‌లకు ఫిర్యాదు చేశామన్నారు. అలాగే ఎంఎల్ఎస్ పాయింట్‌లో పనిచేస్తున్న సివిల్ సప్లయి కార్పొరేషన్ ఉద్యోగులు తూకం వేయకుండా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారని వీరు ఆరోపించారు. ఎంఎల్ఎస్ పాయింట్‌లో తప్పనిసరిగా తూకం వేసిన తర్వాతే డిపోలకు బియ్యాన్ని తరలించేలా తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

చర్యలు తీసుకుంటాం

చీపురుపల్లి ఎంఎల్ఎస్ పాయింట్‌లో రేషన్ డిపోలకు పంపిణీ చేసిన బియ్యం తరుగుదల విషయంపై తహసీల్దార్ సులోచనరాణిని వివరణ కోరగా.. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



తహసీల్దార్‌కు ఫిర్యాదు అందజేస్తున్న డీలర్లు

ప్రజా సేవే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కళా వెంకటరావు



దివ్యాంగుడికి కరపత్రం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

గుర్ల, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రజాసేవకే ప్రభుత్వం పనిచేస్తుందని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. చింతపల్లిపేట గ్రామంలో శనివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింకి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. రూ.6లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును ప్రారంభించారు. అలాగే గోశాలను కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి నాయకులు కేటీఆర్, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సన్యాసినాయుడు, రైతు సంఘం అధ్యక్షుడు సంచాన సన్యాసినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు సీహెచ్ మహేశ్వరరావు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేశాం

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు

విజయనగరం టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గిరిజనుల సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేశామని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.డీవీజీ శంకరరావు తెలిపారు. ఈనెల 27తో తన పదవీ కాలం ముగియ నున్న నేపథ్యంలో శనివారం సాయంత్రం నగరంలోని జడ్పీ అతిథి గృహంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమా వేశంలో ఆయన మాట్లాడారు. రెండేళ్ల పదవీ కాలంలో చేసిన కృషిని వివరించారు. గిరిజనుల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించి, ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదికలు అందజేశామన్నారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి ఎస్టీ చైర్మన్‌గా నియమించిన గత ప్రభుత్వానికి, తమకు అన్ని విధాలా సహకరించిన కూటమి ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీలో చేరిక

విజయనగరం దాసన్నపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్‌వర్మ అన్నారు. శనివారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో భోగాపురం మండలం రాజాపులోవ గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. వారిని ఆయన ఆహ్వానించారు.

డ్రైన్ అక్రమ నిర్మాణం కొట్టివేత

రాజాం రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాజాం-డోలపేట రోడ్డులోని ఓ ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యానికి అనుకూలంగా నిబంధనలను విరుద్ధంగా నిర్మించిన డ్రైన్‌ను శనివారం కొట్టివేశారు. దాని స్థానంలో కొత్త కాలువ నిర్మాణ పనులు ప్రారంభించారు. రాజాంలో రెండో విడత విస్తరణలో భాగంగా 80 అడుగుల మేర రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. అయితే రాజాం-డోలపేట రోడ్డులో ఓ ప్రైవేటు ఆసుపత్రి ముందు 5అడుగులు తగ్గించి కాలువ నిర్మాణ పనులు జరిపించారు. ఈ తప్పిదాన్ని ఈనెల 12న 'వంపు తిరిగిన కాలువ' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో రాజాం మున్సిపల్ కమిషనర్ రామఅప్పలనాయుడు అక్రమ నిర్మాణం జరిగిన ప్రదేశాన్ని సిబ్బందితో కలిసి పరిశీలించారు. నిర్మాణ పనులు నిలిపివేయాలని కాంట్రాక్టర్ ప్రతినిధులను ఆదేశించారు. ఇదే విషయంపై కలెక్టర్ అంబేద్కర్ కూడా ఆరా తీశారు. నిబంధనల మేర నిర్మాణ పనులు జరిపించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. అయితే గత 16 రోజులుగా తర్జనభర్జనలు పడిన ఆర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్ ప్రతినిధులు చేసేదిలేక ఎట్టకేలకు శనివారం గతంలో నిర్మించిన కాల్వను కొట్టివేయించారు. నిబంధనల ప్రకారం 80 అడుగులు వెడల్పు ఉండేలా నిర్మాణం పనులు ప్రారంభించారు.



డ్రైన్ నిర్మాణాన్ని కొట్టివేయిస్తున్న దృశ్యం

ఒడిశా విద్యార్థులకు ఫార్మా హెల్త్ కేర్ రంగాల్లో ఉచిత శిక్షణ

శ్రీకాకుళం రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలం రాగోలు జెమ్స్ కళాశాలలో ఒడిశా విద్యార్థినీ విద్యార్థులకు ఫార్మా హెల్త్‌కేర్ రంగాల్లో ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులను ఎన్‌యూఏ ఒడిశా ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా అక్కడి ప్రభుత్వ సహకా రంతో చేపట్టామన్నారు. ప్లస్ త్రీ పాసైన విద్యార్థులకు పేషెంట్ రిలేషన్ అసోసియేట్, ఎస్ఎస్‌సీ, ప్లస్ టు, ప్లస్ త్రీ పాసైన/ఫెయిలైన అభ్యర్థులకు అసోసియేట్ స్టోర్ ఫార్మా కోర్సు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కోర్సుల్లో చేరేందు కు 18 నుంచి 28 ఏళ్ల మధ్య వయసు కలిగినవారు అర్హులన్నారు. శిక్షణ పొందే విద్యార్థులకు ఉచితంగా భోజన, వసతి, యూనిఫాం, స్టడీ మెటీరియల్ అందించనున్నామన్నారు. కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు దేశంలోని ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉద్యోగా వకాశాలు అభిస్తాయని తెలిపారు. ఇతర వివరాలకు 76809 45357, 79950 13422, 83311 18019 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. అలాగే జెమ్స్ అసుపత్రి ప్రాంగణంలో కార్యాలయంలో కలిసి సమాచారం తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

జిందాల్ నిర్వాసిత గ్రామాల రికార్డులపై ఆరా

శృంగవరపుకోట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు జిందాల్ భూ నిర్వాసిత గ్రామాల రెవెన్యూ రికార్డులపై ఆరా తీశారు. శనివారం స్థానిక తహసీల్దార్ డి.శ్రీనివాసరావును కలిశారు. ఈ గ్రామాలకు సంబంధించిన ఏఏ రికార్డులు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. రికార్డులు ఉన్నాయని, కానీ పాతవి కావడంతో కొన్ని చిరిగిపోయాయని సర్వేయర్ రమ తెలిపారు. పీవోటీల పేరుతో కొంతమందికి నష్టపరిహారం ఇవ్వకపోవడంపై ఆయన తప్పుపట్టారు. పీవోటీలుగా నోటీసులు అందించిన వారికి, కోర్టులో వివాదాలు ఉన్నవారికి నష్టపరిహారం అందించడంతో రెండు వర్గాలు అప్పట్లో సమానంగా పంచుకున్న విషయాన్ని గుర్తుచేశారు. పీవోటీగా గుర్తించిన భూములను తిరిగి అసైన్డ్‌దారునికి అప్పగించాలని చట్టం చెబుతుందని, ఈనేపథ్యంలో రైతులకు పరిహారం అందుకునే అర్హత ఉంటుందన్నారు. పీవోటీలుగా గుర్తించిన 18 మందికి కూడా న్యాయం చేయాలని కోరారు. డీటీ రంజిత్ పాల్గొన్నారు.

దర్యాప్తుపై బాధితుల హర్షం

విజయనగరం బాబామెట్ట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట మండలంలో 2008లో జిందాల్ అల్యూమినీయం కర్మాగారం కోసం భూ సేకరణలో పరిహారం చెల్లింపులో జరిగిన అవకతవకలపై దర్యాప్తునకు కలెక్టర్ డా.బీఆర్ అంబేడ్కర్ ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేయడంపై బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారని లోక్‌సత్తా పార్టీ ఎస్.కోట నియోజకవర్గం అధ్యక్షుడు కె.ప్రసాద్ తెలిపారు. శనివారం ప్రత్యేకాధికారి కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ మురళీని కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఉండే రాజకీయ పార్టీల నేతలు అప్పుడు అనేక అక్రమాలు జరిగినా, నోరు విప్పక రెవెన్యూ అధికారులకు వత్తాసు పలికి, నేడు ప్రకటన చేస్తున్నారన్నారు.

ఉత్తరాంధ్ర నేతలకు ప్రోత్సాహం

- ఎమ్మెల్యే కోండ్రు

రాజాం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయడంలోనే కాదు ఇక్కడ నాయకులను ప్రోత్సహించడంలో కూడా టీడీపీ ముందుంటుందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అశోక్ గజపతిరాజు లాంటి గొప్ప వ్యక్తికి గోవా గవర్నర్ పదవి రావడం, కింజరాపు రామ్మోహన్‌నాయుడుకి కేంద్ర మంత్రి పదవి, సాధారణ కార్యకర్త కలిశెట్టి అప్పలనాయుడును ఎంపీగా చేయడం టీడీపీకే సాధ్యమన్నారు. అశోక్ గజపతిరాజుకు గవర్నర్ పదవి రావడం ఉత్తరాంధ్ర ప్రజలకు గర్వకారణం అన్నారు.

ఉత్తరాంధ్ర అంటే చంద్రబాబుకు అభిమానం

- ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర అంటే చంద్రబాబుకు ప్రత్యేక అభిమానమని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శనివారం ఆమె లక్కవరపు కోటలోని తన నివాసం వద్ద విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిజాయితీకి మారుపేరుగా నిలిచిన అశోక్ గజపతిరాజుకు గవర్నర్ పదవి ఇచ్చి గౌరవించిన పార్టీ టీడీపీ అన్నారు. అలాగే అనేక కంపెనీలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గవర్నర్ పదవికే వన్నె తెస్తారు

- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి

పూసపాటిరేగ, జూలై 26(ఆంధ్రజ్యోతి): గవర్నర్ పదవికే వన్నెతెచ్చే నాయకుడు అశోక్ గజపతిరాజు అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు అన్నారు. శనివారం రెల్లివలస గ్రామంలోని తన స్వగృహంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో గవర్నర్‌గా ఎంపికైన మొదటి వ్యక్తి అశోక్ గజపతిరాజు అని, నిజంగా ఈ ప్రాంత ప్రజలందరికీ ఇది గర్వకారణం అన్నారు. అనంతరం ఆయన స్థానిక ఎమ్మెల్యే నాగమాధవి శుక్రవారం నిర్వహించిన అగ్నిమాపక కేంద్రం శంకుస్థాపనపై విమర్శలు గుప్పించారు. పార్లమెంట్ సమావేశాల మధ్య శంకుస్థాపనలు ఏంటని ప్రశ్నించారు. మాజీ జడ్పీటీసీ నాయకులు ఆకిరి ప్రసాదరావు, పార్టీ మండల అధ్యక్షుడు మహంతి శంకర్రావు, కొత్తకోట వెంకటరమణ పాల్గొన్నారు.

అశోక్‌కు శుభాకాంక్షలు

నెల్లిమర్ల, జూలై 26(ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్‌గా ప్రమాణస్వీకారం చేసిన పూసపాటి అశోక్‌గజపతిరాజుకు టీడీపీ విశాఖపట్టణం ఉత్తర నియోజకవర్గం పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ శనివారం శుభాకాంక్షలు తెలిపారు. గోవా రాష్ట్రం రాజభవన్‌లో జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం అశోక్ గజపతిరాజును కలిసి అభినందనలు తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కంది చంద్రశేఖరరావు, గేదెల రాజారావు, అవనాపు సత్యనారాయణ ఉన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్

- మాజీ సైనికులకు సన్మానం





విజయనగరం దాసన్నపేట, రింగ్‌రోడ్డు: మాజీ సైనికులను సన్మానిస్తున్న దృశ్యం

విజయనగరం దాసన్నపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మాతృభూమి కోసం అత్యంత కఠిన పరిస్థితుల్లో సైతం వెన్నుచూపక పోరాడి అమరులైన వీరుల త్యాగాలు వెలకట్టలేనివని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌వర్మ అన్నారు. శనివారం స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. ఈసందర్భంగా వీర సైనికులకు నివాళులు అర్పించారు. అలాగే మాజీ సైనికులు అప్పారావు దొర, జీఎస్ఎన్ రాజు, కేవీ రామకృష్ణయ్యలను సత్కరించారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

- విజయనగరం రింగురోడ్డు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కార్గిల్ విజయ్‌దివస్ సందర్భంగా శనివారం స్థానిక కంటోన్మెంట్ వద్ద ఉన్న జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం ఆవరణలో గల వార్ మెమోరియల్ వద్ద నేతాజీ మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వీర జవాన్లకు నివాళులు అర్పించారు. అనంతరం మాజీ సైనికులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పి.గుణకరరావు, సంఘ ప్రతినిధులు గోవిందరావు, మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.
- నెల్లిమర్ల, జూలై 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలని సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రశాంత కుమార్ మహంతి పిలుపునిచ్చారు. శనివారం సెంచూ రియన్ యూనివర్సిటీలో కార్గిల్ విజయ్‌దివస్‌ను నిర్వహించారు. రిజిస్ట్రార్ డా.పల్లవి, డీన్ డా.శ్రీనివాసరావు, లెఫ్టినెంట్ డా.ఎ.సతీష్, డిప్యూటీ రిజిస్ట్రార్ డా.ఆర్ఎస్.వర్మ, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

తప్పు ఎవరిది.. శిక్ష ఎవరికి?

- ఒకే ఆధార్‌తో మూడు విద్యుత్ మీటర్లు లింక్
- తల్లికి వందనం జమకాక బాధితుడు ఆందోళన

మెంటాడ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మెంటాడ మండల కేంద్రానికి చెందిన షేక్ పాపారావు ఓ నిరుపేద. అతని కొడుకు షేక్ మహమ్మద్ షాద్ నాలుగో తరగతి చదువుతున్నాడు. అయితే వీరికి తల్లికి వందనం నిధులు జమ కాలేదు. సచివాలయం సిబ్బందిని కలిస్తే.. 'మీ ఆధార్ కార్డుకు మీ విద్యుత్ మీటరుతోపాటు మరో రెండు మీటర్లు లింకు అయి ఉన్నట్టు చూపిస్తోంది' అని చెప్పారు. ఈ మూడు కలిపి 300పైన యూనిట్లు వాడినట్టు ఉన్నందున తల్లికి వందనం వర్తించలేదని తెలిపారు. దీంతో పాపారావు.. విద్యుత్తు ఏఈని కలిసి, ఒక్క మీటరు మాత్రమే ఉన్నట్టు రాతపూర్వకంగా ధ్రువపత్రం తీసుకుని, సూపరింటెండెంట్‌కు అందజేశారు. ఆ తర్వాత విజయనగరం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు. సమస్యను పరిశీలించాలని కలెక్టర్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. వారేమో పరిష్కారానికి 45 రోజులు సమయం పడుతుందని.. అప్పటికీ కాకపోతే, మళ్లీ గ్రీవెన్స్‌కు రావాలని పాపారావుకు సూచించారు. దీంతో పాపారావు దిగాలుగా ఇంటిబాట పట్టారు.

బైకు అదుపు తప్పి.. తుప్పల్లోకి దూసుకువెళ్లి

- తెర్లాంలో యువకుడు మృతి

తెర్లాం, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలో కూనాయవలస గ్రామానికి చెందిన గిడిజాల చందు(24) ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో తుప్పల్లోకి దూసుకువెళ్లి మృతి చెందాడని ఎస్ఐ సాగర్‌బాబు తెలిపారు. అయితే చందు మృతిచెందినట్లు ఆలస్యంగా గుర్తించారు. ఎస్ఐ కథనం మేరకు.. అమిటి గ్రామంలోని బంధువుల ఇంటికి చందు ఈనెల 22న తన వెళ్లాడు. అదేరోజు తిరుగు ప్రయాణంలో తెర్లాం జూనియర్ కళాశాల వద్ద ఉన్న మలుపులో వర్షం కురుస్తున్న సమయంలో ద్విచక్రవాహనం అదుపు తప్పింది. దీంతో పక్కన ఉన్న తుప్పల్లోకి చందు దూసుకువెళ్లాడు. అందులో ఉన్న ఒక చెట్టుకు బైకు ఢీకొనడంతో ద్విచక్ర వాహనం ఆయనపై పడి మృతిచెందాడు. చందు తుప్పల్లో ఉండడంతో ఎవరూ గుర్తించలేదు. వాసన రావడంలో కొంత మంది శనివారం గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. చందుకు భార్య స్వాతి ఇద్దరు కూమార్తెలు ఉన్నారు. చందు వండ్రంగి పని చేసుకుంటూ జీవిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు.

చీరకొంగు బైకు చక్రానికి చుట్టుకోవడంతో..

- మహిళ మృతి

భామిని/పాలకొండ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): భామిని మండలంలోని ఘనసర సమీపంలో పాలకొండ మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన కొండేటి తవిటమ్మ (47) శనివారం బైక్ నుంచి కింద పడి మృతి చెందింది. బత్తిలి పోలీసుల కథనం మేరకు.. అన్నవరం నుంచి ఒడిశాలోని గుణుపూర్‌లో తన తల్లి సంవత్సరీక కార్య క్రమం నిర్వహణకు భర్త జనార్దనతో తవిటమ్మ బైక్‌పై బయలుదేరింది. ఘనసర సమీపంలో చీర కొంగు వెనుక చక్రానికి చుట్టడంతో బైక్ బోల్తా పడింది. దీంతో తవిటమ్మ తలపై తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు సహకారంతో 108లో సీతంపేట ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు ఎస్ఐ జి.అప్పారావు ఆధ్వర్యంలో ఏఎస్ఐ కాంతారావు కుటుంబ సభ్యుల వద్ద నుంచి స్టేట్‌మెంట్ తీసుకొని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పాలకొండ ఆస్పత్రికి పోస్టుమార్టం తరలించినట్టు తెలిపారు. దీంతో అన్నవరంలో విషాదం నెలకొంది.

దారి దోపిడీ కేసులో నిందితుల అరెస్టు



స్వాధీనం చేసుకున్న స్కూటీలు, నిందితుడితో పోలీసులు

విజయనగరం క్రైం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): లారీ డ్రైవర్‌పై దాడి చేసి, రూ.6వేల నగదు తోపాటు సెల్‌ఫోన్ లాక్కెళ్లిన యువకులను విజయనగరం రూరల్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఈఘటనపై విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు స్థానిక విలేకర్లకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం రాయగడ జిల్లాకు చెందిన సాహుకర్ సంతోష్ కుమార్ అనే లారీ డ్రైవర్ ఈనెల 19వ తేదీ రాత్రి లారీపై కర్రల లోడుతో వెళ్తుండగా.. చెల్లూరు బైపాస్ రోడ్డులో కొంతమంది యువకులు రెండు స్కూటీలతో అడ్డగించారు. లారీ డ్రైవర్ తలపై రాడ్‌తో కొట్టారు. అతని వద్ద ఉన్న రూ.6వేల నగదుతో పాటు సెల్‌ఫోన్‌ను లాక్కొని పారిపోయారు. దీంతో సంతోష్ కుమార్ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కదలికలపై నిఘా పెట్టారు. ఈనెల 25న మధ్యాహ్నం సీఐ లక్ష్మణరావుకు వచ్చిన సమాచారంతో ఎస్ఐలు అశోక్‌కుమార్, సాయికృష్ణ, హెచ్‌సీ నాగేంద్రప్రసాద్, అచ్చిరాజు, పీసీలు ఎస్.రమణ, రామకృష్ణ, రామారావు ప్రతాప్‌లు బృందాలుగా ఏర్పడి దాడులు నిర్వహించారు. ఈ దాడిలో లంకాపట్టణానికి చెందిన చెన్నా అఖిల్‌తో పాటు ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. విచారించగా, నేరం చేసినట్టు అంగీకరించారు. వీరి వద్ద నుంచి నాలుగు స్కూటీలు, 1,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై భీమిలి పోలీసు స్టేషన్, టూటౌన్, వన్‌టౌన్, విజయనగరం రూరల్ పోలీసు స్టేషన్‌లలో కేసులు ఉన్నాయి. కేసులు ఛేదించిన ఎస్ఐలు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

చిక్కిన బైకుల దొంగ



పోలీసుల అదుపులో నిందితుడు, స్వాధీనం చేసుకున్న బైకులు

భోగాపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): కొత్తవలస మండలం మంగళంపాలెం గ్రామానికి చెందిన బైకుల దొంగ రాకేటి సూర్యప్రకాశ్ పోలీసులకు చిక్కాడు. శనివారం భోగాపురం మండలంలోని రాజాపులోవ సమీపంలో సూర్యప్రకాశ్‌ను పట్టుకుని అరెస్టు చేశారు. దీనిపై విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ఎస్ఐ పాపారావుకు వచ్చిన సమాచారం మేరకు సీఐ దుర్గాప్రసాద్‌రావు సూచనలతో సిబ్బంది విశాఖ నుంచి రాజాపులోవ వచ్చే రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. మంగళంపాలెంకు చెందిన రాకేటి సూర్యప్రకాశ్ బైకుపై వస్తుండగా పట్టుకున్నారు. బైకుకు సంబంధించిన పత్రాలు చూపించకపోవడంతో అదుపులోకి తీసుకున్నారు. అయితే ఆ బైకుతో పాటు మరో నాలుగు బైకులు దొంగిలించినట్లు అంగీకరించాడు. గతంలో భోగాపురం పోలీస్‌స్టేషన్‌లో 1, విశాఖ జిల్లా పద్మనాభం పోలీస్ స్టేషన్‌లో 2, పూసపాటిరేగ పోలీస్‌స్టేషన్‌లో 1, బొండపల్లి పోలీస్ స్టేషన్‌లో ఒకటి.. బైకు చోరీ కేసులు నమోదయ్యాయి. దీంతో సూర్యప్రకాశ్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈసందర్భంగా సీఐ దుర్గాప్రసాద్ రావును, ఎస్ఐ పాపారావును, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

బెల్లంఊట ధ్వంసం

సీతంపేట రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): కొండాడ పంచాయతీ పరిధిలోని లోవగూడ గిరిజన గ్రామ పరిసరాల్లో శనివారం పోలీసులు నిర్వహించిన దాడుల్లో 1000లీటర్ల సారా ఊటలను గుర్తించి ధ్వంసం చేసినట్లు ఎస్ఐ వై.అమ్మనరావు తెలిపారు. అక్రమంగా సారా వంటకాలు, రవాణా, విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అవే స్మార్ట్ మీటర్లు పెట్టిస్తున్నారు

● మానవీయ సమాజ నిర్మాణమే లక్ష్యం
● సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి నాగేశ్వరరావు

బొబ్బిలి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): 'అదానీ స్మార్ట్‌మీటర్లను పగలగొడతామని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేశ్‌లు ఇప్పుడు అవే మీటర్లను పెట్టిస్తున్నారు. దీనిపై ప్రజలకు ఆ ముగ్గురు సంజాయిషీ చెప్పాల్సిందే. విద్యుత్ మీటర్ల కాంట్రాక్టరు జగన్‌కు బినామీ అన్నారు. ఇప్పుడెవరికి బినామీ? నిగ్గుతేలాలి. పప్పుబెల్లాల పంపిణీ పార్టీలను ఇంటికి పంపించి శాసించే స్థాయికి తమ పార్టీ ఎదుగుతుంది' అని సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం బొబ్బిలిలో సీపీఐ 14వ జిల్లా మహాసభలు నిర్వహించారు. తొ లుత సీబీఎం పాఠశాల నుంచి ప్రధానరోడ్లు మీదుగా తాండ్రపాపారాయ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా సీపీఐకార్యదర్శి ఒమ్మి రమణ అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో నాగేశ్వరరావు మాట్లాడు తూ 'రాష్ట్రంలో జగన్‌కు 151 సీట్లతో ప్రజలు అధికారం కట్టబెడితే ఆయన దుర్వినియోగం చేసుకున్నాడు. పోలీసు రాజ్యంతో నిరంకుశంగా పాలనచేశాడు. ప్రజాస్వామ్యవాదులను అణగదొక్కాడు. 11 సీట్లకు దిగజారిపోయాడు. పేదల కోసం ఎన్నో చట్టాలు చేసే అవకాశం వచ్చినా జగన్ అలా చేయకుండా అనుచితంగా పాలన సాగించాడు. సభలు, సమావేశాలకు జగన్ చేసిన జీవోలకు వ్యతిరేకంగా కోర్టునుంచి సీపీఐ ఆర్డర్లు తెచ్చుకుంది. బటన్ నొక్కుడు తప్ప ఇంకేమీ ఆయనకు చేతకాలేదు' అని ఆరోపించారు. కులం, మతం పేరుతో వచ్చే పార్టీలతో ప్రజారాజ్యస్థాపన సాధ్యం కాదని, మానవీయ సమాజాన్ని నిర్మించడమే సీపీఐ లక్ష్యమని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గుజ్జల ఈశ్వరయ్య మాట్లాడుతూ వైసీపీ, టీడీపీ రెండూ దొందూ దొందేనని, ఎమ్మెల్యేలు కాంట్రాక్టర్లుగా మారి ప్రజా సంపదను దోచుకుంటున్నారని ఆరోపించారు. మహాసభలలో సీపీఐ నాయకులు పి.కామేశ్వరరావు, కండాపు ప్రసాదరావు, బుగత అశోక్, అలమండ ఆనందరావు, మునకాల శ్రీనివాస్, కోరంగి మన్మధరావు, కోట అప్పన్న పాల్గొన్నారు.


బొబ్బిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ శ్రేణులు

ప్రభుత్వ ఆశయం మేరకు సేవలందించాలి

● బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన


సీఎం రిలీఫ్ ఫండ్‌చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్‌లో భోజనం కోసం వచ్చిన వారితో మర్యాదగా మెలగాలని, ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వ ఆశయం మేరకు సేవలందించాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన కోరారు.శనివారం బొబ్బిలిలోని అన్న క్యాంటీన్ పరిశీలించారు. అలాగే నియోజకవర్గం పరిధిలో పలువురికి మంజూరైన రూ. 18 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బేబీనాయన కోటలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, టీడీపీ నాయకులు రౌతు రామ్మూర్తి, అల్లాడ భాస్కరరావు పాల్గొన్నారు.

బొబ్బిలిలో కార్గిల్ విజయ్ దివస్


బొబ్బిలిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ సైనికోద్యోగులు

బొబ్బిలి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి కార్గిల్ విజయ్‌దివస్‌ను శనివారం నిర్వహించారు. కార్గిల్‌యుద్ధంలో భారత సైన్యం పాకిస్థాన్‌పై విజయం సాధించి 26సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అమరవీరుల స్మారకార్థం శనివారం బొబ్బిలి ఎన్‌టీఆర్ కూడలిలో విజయోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యుడు పెంట స్వామినాయుడు, నియోజకవర్గ కన్వీనరు మరిశర్ల రామారావునాయుడు, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పుల్లెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్గిల్ యుద్ధంలో సాధించిన విజయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే తారకరామా కాలనీ మునిసిపల్ పాఠశాలలో హెచ్‌ఎం ఉషారాణి ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్‌దివస్ నిర్వహించారు. అలాగే బొబ్బిలిలో మాజీ సైనికోద్యోగుల సంక్షేమసంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. సంఘం గౌరవాధ్యక్షుడు మరడ అప్పారావు, అధ్యక్షుడు రేవళ్ల కిరణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో స్థానిక పాతకోట నుంచి మాజీ సైనికులు, వాసు జూనియర్ కళాశాల విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

బొబ్బిలిలో ఆశావర్కర్ల యూనియన్ మహాసభలు

బొబ్బిలి, జూలై 26 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలిలో వచ్చే నెల 17న జరగనున్న ఆశావర్కర్ల యూనియన్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి పిలుపునిచ్చారు. శనివారం బొబ్బిలి సీఐటీయూ కార్యాలయంలో మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లాఅధ్యక్షుడు పి.శంకరరావు, ఆశా యూనియన్ నాయకులు ఎల్.శాంతమ్మ, లక్ష్మి, కృష్ణవేణి, నాగరత్నం, భార్గవి, చెంచు లక్ష్మి పాల్గొన్నారు.

15లోగా ఈ-పంట నమోదు చేసుకోవాలి

బొబ్బిలి రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పొలం గట్లపై కంది పంట వేయడం వల్ల భూమి కోతను నివారించవచ్చని ఏవో మజ్జి శ్యామ్‌సుందర్ తెలిపారు. శనివారం బొబ్బిలిలో కంది విత్తనాలుపంపిణీచేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి పంట సాగు చేసే రైతులకు పొలం గట్లపై సాగు చేయడానికి కంది విత్తనాలు జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా ఉచితంగా అందించామని చెప్పారు.అలాగే రైతులు తప్పనిసరిగా సెప్టెంబర్ 15లోగా ఈ-పంట నమోదు చేసుకోవాలని బొబ్బిలి ఏవో మజ్జి శ్యామ్‌సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. కౌలు రైతులు, డి పట్టా, ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టా భూములు కలిగిన రైతులు పంటల నమోదుకు అర్హులేనని పేర్కొన్నారు.

పిల్లల సంరక్షణపై అవగాహన

బొబ్బిలి రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్న పిల్లల సంరక్షణ, విద్య ప్రాముఖ్యత గురించి కార్యకర్తలు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. శనివారం బొబ్బిలిలోని అంగన్‌వాడీ కేం ద్రాల్లో ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ డే (ఈసీసీఈ) దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగాప్రీస్కూల్ పిల్లల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పద్మ, ప్రభావతి, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు. రంగరాయపురం అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈడే) నిర్వహించారు.

కెల్ల సొసైటీ అధ్యక్షురాలిగా విమలారాణి

గుర్ల, జూలై 26(ఆంధ్రజ్యోతి): కెల్ల సొసైటీ అధ్యక్షురాలిగా కె.విమలారాణి బాధ్యతలు స్వీకరించారు. శనివారం స్థానిక సొసైటీ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో సొసైటీ సభ్యులు, రైతుల సమక్షంలో ఆమె ప్రమాణస్వీకారం చేశారు.ఈసందర్భంగా ఆమె ముఖ్యమంత్రి, చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే కళావెంకటరావుకు కృతజ్ఞతలు తెలిపారు. డైరెక్టర్లుగా కె.రమణ చిట్టిరాజును ఎన్నుకున్నారు. కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రామ్‌మల్లిక్‌నాయుడు, చీపురుపల్లి నాయకులు కేటీఆర్, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సన్యాసినాయుడు, జిల్లా నాయకులు కిరణ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు సీహెచ్ మహేశ్వరరావు హాజరయ్యారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

కొత్తవలస, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రజలు నాలుగు నెలలు పాటు వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారి సీతల్ వర్మ సూచించారు. శనివారం కొత్తవలస పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో ఆయన సమావేశ నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి, జ్వరాలతో ఉన్నవారిని గుర్తించాలన్నారు.

బుంగమూతి పుస్తకావిష్కరణ

ఎస్.కోట రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): చామలాపల్లిలో రచయిత, ఉపాధ్యాయుడు పట్రాయుడు కాశీవిశ్వనాథం రచించినబుంగమూతి పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. కాశీమామయ్య కథలతో ఈయన ప్రసిద్ధి చెందారు. ఈయన భార్య గుమ్మ నాగమంజరి కూడా ప్రముఖ రచయిత్రి, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కావడం విశేషం.

మండల సర్వేయర్‌గా ఖాదర్

మెరకముడిదాం, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండల సర్వేయర్‌గా విజయనగరం ఏడీ ఆఫీస్ హెడ్ ఆఫీస్‌లో పనిచేసిన పి.ఖాదర్ శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వేయర్‌గా బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దార్ సులోచనరాణి, సిబ్బంది ఆయన్ని ఆహ్వానించారు.

యూరియా కోసం అన్నదాతల అగచాట్లు

రామభద్రపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు యూరియా కోసం అగచాట్లకు గురవుతున్నారు. రామభద్రపురం, ఆరికతోట, కొత్తరేగ, కొట్టక్కి పీఏసీఎస్‌ల చుట్టూ రైతులు తిరుగుతున్నారు.ఈఏడాది మండలంలోవరి 2,650, మొక్కజొన్న ఐదు వందల హెక్టార్లలో సాగుచేశారు. వర్షాలు కురుస్తుండడంతో వరి ఎదలు, మొక్కజొన్నకు ప్రస్తుతంయూరియా చల్లాలి. ఇటీవల సోంపురంలో రైతు సేవా కేంద్రం వద్దయూరియా కోసం రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగిన విషయం విదితమే. అధికారులు యూరియా కొరత లేకుండా చర్య తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


ఆరికతోట పీఏసీఎస్ వద్ద యూరియా కోసం నిరీక్షిస్తున్న రైతులు

విలీనంపై ఆశలు

(ఐదో పేజీ తరువాయి)

పునర్విభజన చేపట్టింది. పార్లమెంట్ నియోజకవర్గాల పరిధి మేరకు కొత్త జిల్లాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.దీంతో విశాఖ పార్లమెంటు పరిధిలో ఉన్న శృంగవరపుకోట ఆ జిల్లాలో కలిసిపోతుందని ఇక్కడి ప్రజలు సంబరపడ్డారు. కానీ, ఎస్.కోటను విజయనగరం జిల్లాలోనే ఉంచేశారు. దీన్ని ఈ ప్రాంత వాసులు తీవ్రంగా వ్యతిరేకించినా వైసీపీప్రభుత్వం పట్టించుకోలేదు. అయితే, తాము అధికారంలోకి వస్తే ఎస్.కోటను విశాఖలో కలిపేస్తామని 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. అనుకున్నట్లే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జిల్లాల పునర్విభజనపై మంత్రులతో కమిటీని ఏర్పాటు చేసింది. దీంతో విశాఖపట్నం జిల్లాలో ఎస్.కోట నియోజకవర్గం విలీనంపై స్థానికులు ఆశలు పెట్టుకున్నారు.

అభివృద్ధి వైపు అడుగులు..

ఎస్.కోట నియోజకవర్గం ప్రస్తుతం అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. ఇప్పటికే కొత్తవలస మండలంలో శారద స్టీల్, జిందాల్ ఫెర్రో, లక్కవరపుకోట మండలంలో సింహాద్రి స్టీల్, మంగళ్ టీఎంటీ వంటి పరిశ్రమలు ఉన్నాయి. కొత్తవలసలో కొత్తగా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటవుతుంది. జామి మండలంలో ఇప్పటికే సిమెంట్ కంపెనీ ఉంది. ఎస్.కోట మండల పరిధిలోని జిందాల్ భూముల్లో ఇండస్ట్రియల్ పార్కులు, కొత్తవలస మండలంలో ఎంఎస్‌ఎంఈ పార్కులను నెలకొల్పే ప్రయత్నంలో ప్రభుత్వం ఉంది. విశాఖ-అరకు రోడ్డు, రాయపూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే వంటివి ఈ నియోజకవర్గంలో ఉన్నాయి. రైలు మార్గం కూడా దగ్గరలో ఉంది. నూతనంగా నిర్మిస్తున్న భోగాపురం విమానాశ్రయం సైతం దగ్గరే. వీటికి తోడు విశాఖ జిల్లాలో ఎస్.కోటను కలిపేస్తే మరింత అభివృద్ధి చెందుతుందని స్థానికుల మాట.

యూరియా కోసం బారులు

(ఐదో పేజీ తరువాయి)

కావస్తున్నా రైతులందరికీ ఎరువులు అందకపోవడంతో ఆందోళనకు దిగారు. యూరియా కావాల్సిన రైతులు ఖచ్చితంగా రెండు ప్యాకెట్ల గులికెలు కొనాల్సిందేనని డీలర్ మెలికపెట్టడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం రెండు గంటలయ్యేసరికి యూరియా అయిపోవడంతో తీవ్ర నిరాశతో ఇంటబాట పట్టారు.

రెండు బస్తాలు చాలవు

నాకుపదెకరాల భూమిఉంది.కేవలం రెండు బస్తాలు మాత్రమే యూరియా ఇస్తున్నారు. ఇది ఏమూలకూ చాలదు. మిగిలిన భూమిని ఎలా సాగు చేయాలి. ఎరువులు కొరతలేదని వ్యవసాయశాఖ మంత్రి ప్రకటిస్తుంటే ఏడు గంటలు క్యూలో ఉంటే రెండుబస్తాలు యూరియా ఇచ్చారు. సరిపడినంత యూరియా అందుబాటులో ఉంచాలి.

రామినాయుడు, రైతు, పెనుబాక

గులికెలు కొంటేనే..

రెండు గులికెల ప్యాకెట్లు కొంటేనే రెండు యూరియా బస్తాలు ఇస్తున్నారు. వాటిని ఏం చేసుకోవాలి. రూ.600తో సరిపోవాల్సింది రూ. 1000 ఖర్చు అవుతోంది. దీనికితోడు ఆటోల ఖర్చు. ఏడు గంటల పాటు క్యూలో ఉంటేనే యూరియా దొరికింది.

అప్పలనాయుడు, రైతు, కంచరాం.

సాగునీటి గలగలలే..

(ఐదో పేజీ తరువాయి)

లీకులవుతున్నాయి. సాగునీరు చంపావతిలోకి వృథాగా పోతోంది. ప్రస్తుతం జలాశయంలో 140.90 మీటర్ల నీరు నిల్వ ఉండగా ఆదివారం 100 క్యూసెక్కుల నీటిని మంత్రులిద్దరు విడుదల చేయనున్నారు. శివారు ఆయకట్టు వరకూ నీరందేలా చూస్తామని ఇరిగేషన్ డీఈ రామునాయుడు తెలిపారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

బాడంగి, జూలై 26(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఇమ్రాన్ రక్త విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దత్తి సత్యనారాయణ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలి

శృంగవరపుకోట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను విడుదల చేయాలని దళిత ఉద్యమ నేత అతవ ఉదయ్ భాస్కర్ డిమాండ్ చేశారు. శనివారం ఎస్.కోటలో విలేకర్లతో మాట్లాడారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాలు, కులాంతర వివాహాల పారితోషకం, ఎన్‌ఎస్‌ఎఫ్‌డీ రుణాలు వంటి వాటిని మంజూరు కాకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. అంబేడ్కర్ విజ్ఞాన కేంద్ర ప్రతినిధులు పి.సూరిదేముడు, గుర్రపు శ్రీను, ఈశ్వరరావు పాల్గొన్నారు.

పబ్లిక్ ప్రకటన

విజయనగరం జిల్లా, విజయనగరం మండలం, కణపాక అయ్యన్నపేట గ్రామం తాలుకా సర్వే నెం.96/5లో గల య.6.65సెంట్ల భూమికి చట్టపరమైన హక్కుదారులైన లేటు మంత్రిప్రగడ సూర్యనారాయణగారి మరణానంతరం, వీరి చట్టపరమైన వారసులైన లేటు మంత్రిప్రగడ భాస్కర సాంబశివరావు గారి మరణానంతరం, వారి చట్టపరమైన వారసులైన.
1.శ్రీ మంత్రిప్రగడ సురేష్ S/o లేటు భాస్కర సాంబశివరావు
2.శ్రీమతి మంత్రిప్రగడ మంగాదేవి W/o లేటు భాస్కర సాంబశివరావు
3.శ్రీ మంత్రిప్రగడ సంతోష్‌బాబు S/o లేటు భాస్కర సాంబశివరావు
4.శ్రీ మంత్రిప్రగడ ఫణికుమార్ శర్మ S/o లేటు భాస్కర సాంబశివ రావు
5.శ్రీ మంత్రిప్రగడ రమేష్ శర్మ S/o లేటు భాస్కర సాంబశివరావు
6.శ్రీమతి ఆకెళ్ళ కళ్యాణి D/o లేటు భాస్కర సాంబశివరావు
పైన తెలిపిన ఆరుగురు ఏకస్తులై రాజమండ్రి తాలూకా 1.నడిపెన లక్ష్మీనారాయణ ప్రసాద్ S/o గొల్లబాబు, 2.మేడిశెట్టి కులదీప్ శ్రీనివాసరావు గల S/o సంపత్ పద్మనాభం అనే మా క్లైంట్‌లుకు వీరు ఇది వరకే ఈసర్వే నెంబరు గల భూమికి సంబంధించి క్రయ అగ్రిమెంటు చేశారు. తరువాత నోటరైజ్డ్ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీని ఇవ్వడం జరిగినది. కావున వారు ఎవరికైనా ఎటువంటి లావాదేవీలు (Lease, Sale Mortgage, Gpa etc..) చేసిన అవి చెల్ల నేరవు అని ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియపరుస్తున్నాను కావున, కాదని ఎవరైన ఎటువంటి లావాదేవీలు జరిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

Pothana Ramakoteswara Rao
Advocate High Court of Amaravathi
Cell : 99598 77225

పోలీసుశాఖలో కారుణ్య నియామకం


సీహెచ్ తేజకు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసుశాఖలో అనారోగ్య కారణాలతో ఉద్యోగ విరమణ చేసిన ఓ పోలీసు కుటుంబంలోని కుమారునికి కారుణ్య నియామకం చేశారు. ఏఆర్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేసిన సీహెచ్ ఈశ్వరరావు ఇటీవల అనారోగ్య కారణాలతో ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఆయన కుమారుడు సీహెచ్ తేజను జూనియర్ సహాయకుడిగా నియమిస్తూ ఎస్పీ వకుల్ జిందాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఏఎస్పీ సౌమ్యలత, డీపీవో సూపరిడెంట్‌ంట్ వెంకటలక్ష్మి, జూనియర్ సహాయకురాలు చాముండేశ్వరీ పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలాలను లీజుకు ఇవ్వడం తగదు

పాలకొండ,జూలై 26 (ఆంధ్రజ్యోతి): పాలకొండలోని విలువైన ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇవ్వడం తగదని ఎన్‌ఎంయూ డిపో కార్య దర్శి వావిలపల్లి రాజేష్ పేర్కొన్నారు.శనివారం పాలకొండ డిపో గేటు వద్ద నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూలీజు వ్యవహారంపై శని, ఆదివారాల్లో తమయూనియన్‌ఆధ్వర్యంలో అన్ని డిపోల ఎదుట ఎర్ర బ్యాడ్జీలతో ఉద్యోగులునిరసన తెలియజేస్తారని చెప్పారు.

సెప్టెంబరు 23 నుంచి బ్రహ్మోత్సవాలు

విజయనగరం కల్చరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విజయనగరం టౌన్ లేఅవుట్ సెంటర్‌లో వేంచేసి ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సెప్టెంబరు 23 నుంచి 24వ బ్రహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్టు ఆ ఆలయ శ్రీనివాసా సేవా సంఘం కార్యదర్శి చెరుకూరి శ్రీధర్, ఉపాధ్యక్షుడు అల్లాడి శివరామకృష్ణ తెలిపారు. శనివారం ఆలయ ప్రాంగణంలో సంఘ ప్రతినిధులతో కలిసి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ బ్రహ్మోత్సవాలను గత 23 ఏళ్లుగా నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది మరింత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. సెప్టెంబరు 23 నుంచి ప్రారంభం కానున్న ఈ ఉత్సవాలు అక్టోబరు 2వ తేదీ వరకూ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సంఘం ప్రతినిధులు సూర్యలక్ష్మి, శైలజ, గౌరీనాయుడు, రమణమూర్తి పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

బెలగాం/పార్వతీపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు రెండు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ డిమాండ్ చేశారు. శనివారం పార్వతీపురంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు భిక్షాటనచేస్తూ నిరసన తెలిపారు.ఈసందర్భంగా మురళీ మోహన్ మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలు చేపట్టినా కానీ జీతాలు ఇవ్వడం మరిచి పోయారన్నారు.జీతాలకోసం అడిగితేఉపాధ్యాయులకు పొజిషన్‌ఐడీ కోసం సీఎం చంద్ర బాబునాయుడు సంతకం ఇంకా చేయలేదని చెప్పడం సబబు కాదని పేర్కొన్నారు. రెండు నెలలుగా జీతాలు లేక ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. అధికారంలోకి రాకముందు సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉపాధ్యాయులకు యాప్‌ల భారాన్ని తగ్గిస్తామని, విద్యా బోధనపైనే వారి దృష్టి ఉండేలా చర్యలు చేపడతామని తెలిపారు.

ఇంజనీరింగ్ సహాయకులు సమన్వయంతో పనిచేయాలి

బొబ్బిలి రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి):ఇంజనీరింగ్ సహాయకులు సమన్వయంతో పనిచేసుకోవాలని పీఆర్ డీఈఈ సీహెచ్‌వి అప్పారావు కోరారు.శనివారం బొబ్బిలిలో నియోజకవర్గంలోని బొబ్బిలి, తెర్లాం, బాడంగి, రామభద్రపురం మండలాల ఇంజనీరింగ్ సహాయకులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ గ్రామాల్లో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే దాని గురించి చర్చించి పరిష్కార మార్గాలను కనుగొనడానికి ప్రయత్నించాలని, మీ వల్ల పరిష్కారం కాని సమస్యలను ఉన్నతాదికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ డిల్లేశ్వరరావు, ఎంపీడీవో రవికుమార్, ఏఈ రాజశేఖర్, అప్పారావు పాల్గొన్నారు.

సక్రమంగా తాగునీరు అందించాలి

రాజాం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో బోర్ల నుంచి సక్రమంగా తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఆదేశించారు. మండలంలోని కంచరాం, రాజియ్యపేటల్లో గల బోర్లను ఆయన శనివారం పరిశీలించారు. వాటి నుంచి శాంపిల్ తీసి పీఆర్ ఒన్ యాప్‌కు పరిశీలనకు పంపించారు. గ్రామాల్లో ఎక్కడ చెత్త లేకుండా శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం గ్రామ సచివాలయాలను సందర్శించారు.

రోడ్డును ఆక్రమిస్తే కఠిన చర్యలు

చీపురుపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ఎల్.దామోదరరావు హెచ్చరించారు. శనివారం ఆయన తన సిబ్బందితో కలిసి పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఆక్రమణల్ని తొలగించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ వ్యాపారాలు సాగిస్తున్న వారు తమకు కేటాయించిన స్థలాల్లో మాత్రమే తమ వస్తువులు ఉంచాలన్నారు. వ్యాపారాల కోసం రహదారిని ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. పట్టణంలోని రద్దీని దృష్టిలో ఉంచుకుని, తమ వాహనాలను పార్కింగ్ చేయాలని వాహన చోదకుల్ని కోరారు.

నేడు జేవీవీ డివిజన్ సమావేశం

రాజాం రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక రాజాం డివిజన్ సమావేశం ఈనెల 27న రాజాంలో నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు జరజాన నీలయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని విద్యానికేతన్ పాఠశాలలో సమావేశం నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

నానో ఎరువులపై రైతులకు అవగాహన కల్పించాలి

భోగాపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): నానో ఎరువులపై రైతులకు అవగాహన కల్పించాలని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, ఇఫ్కో డైరెక్టర్ కర్రోతు బంగార్రాజు ఇఫ్కో అధికారులకు సూచించారు. పోలిపల్లి గ్రామంలోని తన స్వగృహం వద్ద ఆయన్ని ఇఫ్కో మేనేజర్ జగదీష్ మిశ్రా శనివారం కలిశారు.ఈసందర్భంగా నానో ఎరువులు, డ్రోన్ సౌకర్యం తదితర వాటిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జేడీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తాగునీరు వృథా



రేగిడి, జూలై 26(ఆంధ్రజ్యోతి): బొడ్డవలస రక్షిత పైలెట్ ప్రాజెక్టు నుంచి సరఫరా అవుతున్న రక్షితనీరు మజ్జిరాము నిపేట వద్ద వృథాగా పోతోంది. గత వారం రోజులుగా ఈ పరిస్థితి ఉన్నా ఏ ఒక్కరూ పట్టించుకోవటంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పైపులైన్ లీక్ కావడంతో పలు గ్రామాలకు తాగునీటి కొరత ఏర్పడుతోంది.